పీసా కమిటీ ఎన్నికలు ప్రశాంతం

రెండు గ్రామాల ఎన్నికలు వాయిదా

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల వ్యాప్తంగా మూడో విడత నాలుగు గ్రామాల్లో పీసా కమిటీలకు పోలింగ్ జరగాల్సి ఉండగా రెండు గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పాత చీమలవారిగూడెం గ్రామంలో ఎన్నిక నిర్వహించగా ఉపాధ్యక్షుడిగా పండు జగదీష్, కార్యదర్శిగా కోర్స శ్రీనివాసరావు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కె.శ్రీనివాస్ తెలిపారు. అదేవిధంగా జిల్లెళ్లగూడెం గ్రామంలో ఎన్నిక నిర్వహించగా ఉపాధ్యక్షుడిగా కోర్స అర్జున్, కార్యదర్శిగా తెల్లం ముత్యాలరావులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి యు.రామానుజం తెలిపారు. కాగా మిగిలిన రెండు గ్రామాలైన స్వర్ణవారిగూడెం, గంగన్నగూడెం గ్రామాల్లో ఎన్నిక నిర్వహించగా కొరం లేకపోవడంతో ఎన్నిక మళ్లీ వాయిదా పడినట్లు ఎన్నికల అధికారులు నవీన మణిమాల, నిఖిల్ మధు శరణ్ తెలిపారు.

మోగిన గ్రాడ్యుయేట్.. ఎన్నికల గంట

ఉమ్మడి గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్ విడుదల

ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఏలూరు జిల్లాకలెక్టర్‌కు అప్పగింత

ఫిబ్రవరి 3వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్, పదో తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ

27వ తేదీన పోలింగ్, మార్చి మూడో తేదీన ఎన్నికల కౌంటింగ్

ఆరు విభజిత జిల్లాల్లో 440 పోలింగ్ కేంద్రాలు, 3,15,261 మంది ఓటర్లు

అమల్లోకి ఎన్నికల కోడ్, నామినేషన్ తేదీ వరకూ ఓటు నమోదుకు అవకాశం

ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తూర్పు, పశ్చిమ ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల గంట మోగింది. బుధవారం అందుకు సంబంధించిన షెడ్యూల్ కేంద్ర ఎన్నికల కమీషన్ విడుదల చేసింది. దీంతో ఒక్కసారిగా ఎన్నికల కోలాహలం ఊపందుకుంది. రిటర్నింగ్ అధికారి హోదాలో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్‌ను ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి విలేకరుల సమావేశంలో వివరించారు. ఫిబ్రవరి మూడో తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. పదో తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ కొనసాగనుంది. 13వ తేదీతో విత్‌డ్రాల పర్వం ముగియనుంది. 27వ తేదీన ఎన్నికల పోలింగ్, మార్చి మూడో తేదీన ఎన్నికల కౌంటింగ్ జరగనుంది. ఉభయగోదావరి జిల్లాల పరిధిలో విభజించిన ఏలూరు, పశ్చిమ, అల్లూరి సీతారామరాజు, బిఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల పరిధిలో ఎన్నికల ప్రక్రియ జరగనుంది. ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 440 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల్లో మొత్తం 3,15,261 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనుండగా, ఇందులో పురుష ఓటర్లు 1,83,734 మంది, మహిళా ఓటర్లు 1,31,507 మంది, థర్డ్ జండర్ ఓటర్లు 20 మంది ఉన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో కలెక్టర్ వెట్రిసెల్వి బుధవారమే రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. నామినేషన్ల తేదీ వరకూ కొత్తగా ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

అమల్లోకి ఎన్నికల కోడ్..

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో బుధవారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. దీంతో ఇప్పటికే ప్రకటించిన గృహప్రవేశాలు వంటి ప్రభుత్వ కార్యక్రమాలు నిలిచిపోనున్నాయి. పశ్చిమగోదావరి జిల్లా

మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రి సెల్వి

పెనుగొండలో జరగనున్న సిఎం పర్యటన జరుగుతుందో లేదో తేలాల్సి ఉంది. సాధారణ ఎన్నికలకు వర్తించే అన్ని నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త పనులేవీ చేపట్టడానికి వీలుండదు. ప్రజాప్రతినిధులు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడంపై ఆంక్షలు ఏర్పడనున్నాయి.

రిటర్నింగ్ అధికారిగా ఏలూరు జిల్లాకలెక్టర్

ఉభయగోదావరి జిల్లాలో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కాకినాడ జిల్లా కలెక్టర్ వ్యవహరించేవారు. ఎంఎల్‌సి ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ, కౌంటింగ్ ప్రక్రియ అంతా కాకినాడ కలెక్టర్ ఆధ్వర్యంలోనే జరిగేది. ఈ సారి గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారిగా ఏలూరు జిల్లా కలెక్టర్‌ను నియమించారు. దీంతో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల ప్రక్రియ అంతా ఏలూరు కేంద్రంగా జరగనుంది. ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ, కౌంటింగ్ ఏర్పాట్లు, మీడియా సెంటర్‌తో పాటు అన్నీ ఏలూరులోనే ఏర్పాటు కానున్నాయి.

టిడిపి, పిడిఎఫ్ మధ్య పోటీ..

ఉభయగోదావరి జిల్లా గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి టిడిపి, పిడిఎఫ్ అభ్యర్థి మధ్య పోటీ ఉండనున్నట్లు చెప్పొచ్చు. ఇప్పటికే టిడిపి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖరం ఆ పార్టీ ప్రకటించింది. ఉపాధ్యాయ నేతగా రాష్ట్రస్థాయిలో పనిచేసిన డివి.రాఘవులును అభ్యర్థిగా ప్రకటించడం జరిగింది. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా మరికొంత మంది నామినేషన్ వేసే అవకాశం ఉంది. వైసిపి తమ అభ్యర్థిని బరిలో దింపుతుందో లేదో చూడాల్సి ఉంది. షెడ్యూల్ విడుదల కావడంతో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల కోలాహలం ఊపందుకుంది.

ఆరుజిల్లాల ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు..

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	థర్డ్ జండర్	మొత్తం
ఏలూరు	62	24,895	17,699	8	42,602
పశ్చిమ	93	39,780	30,103	1	69,884
అల్లూరి సీతారామరాజు	12	2,839	1,825	0	4,664
కాకినాడ	96	42,437	27,899	7	70,343
బిఆర్ అంబేద్కర్ కోనసీమ	95	37,069	27,256	2	64,327
తూర్పుగోదావరి	82	36,714	26,725	2	63,441
మొత్తం	440	1,83,734	1,31,507	20	3,15,261

ఎన్నికల షెడ్యూల్..

నోటిఫికేషన్ : 3.02.2025
నామినేషన్ ఆఖరుతేదీ : 10.02.2025
నామినేషన్ పరిశీలన :11.02.2025
విత్‌డ్రా ఆఖరు తేదీ : 13.02.2025
ఎన్నికల పోలింగ్ : 27.02.2025
సమయం : ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటలు
కౌంటింగ్ :3.03.2025
ఎన్నికల ప్రక్రియ పూర్తి :8.03.2025

మార్కెట్ కమిటీలకు కోడ్ అడ్డు

ఏలూరు జిల్లాలో 9 మార్కెట్ కమిటీల నియామకాలకు ఉత్తర్వులు

రిజర్వేషన్లు ఖరారు, పోలవరం కమిటీ రిజర్వేషన్ మార్పునకు తిరిగి ప్రతిపాదన

ప్రతి కమిటీకీ ఛైర్మన్, వైఎస్ ఛైర్మన్, 13 మంది సభ్యుల నియామకం

ఎంఎల్‌సి కోడ్ తర్వాతే మార్కెట్ పదవుల భర్తీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మార్కెట్ కమిటీల పదవుల నియామకాలకు సంబంధించి బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ రావడంతో ముందుకు సాగే ప్రక్రియ లేకుండా పోయింది. ఏలూరు జిల్లాలో మొత్తం తొమ్మిది మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఉంగుటూరు, భీమడోలు మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవులు బిసి మహిళకు, కైకలూరు బిసి మహిళ, కలిదిండి, ఏలూరు, చింతలపూడి ఓసి జనరల్‌కు, దెందులూరు ఓసి మహిళకు, నూజివీడు ఎస్‌సి జనరల్, పోలవరం ఎస్‌టి జనరల్‌కు రిజర్వేషన్ కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పోలవరం మార్కెట్ కమిటీ ఓసి రిజర్వేషన్ కేటాయించాలంటూ అక్కడ నాయకులు కోరడంతో ఆ ప్రతిపాదనను జిల్లా అధికారులు తిరిగి పంపారు. ఇంతలో గ్రాడుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాతనే మార్కెట్ కమిటీల ఎన్నికలు జరగనున్నాయి. ప్రతి మార్కెట్ కమిటీకీ ఛైర్మన్, వైఎస్ ఛైర్మన్ కాకుండా 13 మంది సభ్యులను నియమిస్తారు. సభ్యుల్లో ట్రేడర్స్ ముగ్గురు, పెద్ద రైతులు ఐదుగురు, చిన్న రైతులు ఐదుగురు, మరో ఇద్దరు సభ్యులు ఉంటారు. పదవులపై ఎన్నో ఆశలతో ఉన్న నాయకులకు, ఎన్నికల కోడ్‌తో తీవ్ర నిరాశ నెలకొంది.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి



సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో బుధవారం ఇంటర్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ వెట్రిసెల్వి అధ్యక్షతన జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 55 పరీక్షా కేంద్రాల్లో మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ ఉదయం 9 గంటలకు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తున్నామని, పరీక్షలకు 33,511 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకుని పరీక్షా అనంతరం తిరిగి వారి స్వస్థలాలకు చేరుకునేలా ఆర్‌టిసి బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. సంబంధిత బస్సుల ఫిట్‌నెస్‌ను ముందుగానే పరిశీలించుకోవాలని కండిషన్‌లో ఉండేటట్టు చూసుకోవాలన్నారు. కొన్ని అదనపు బస్సులు కూడా అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలు, ప్రాక్టికల్స్ నిర్వహించే సెంటర్లలో సిసి కెమెరాల నిఘా ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాలను నో సెల్ ఫోన్‌జోన్‌గా నిర్దేశించడం జరిగిందని, పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్లు అనుమతించబడవన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ 08812-230197 ఫోన్ నంబరుతో ఏర్పాటు చేశారని, దీంతో పాటు కలెక్టరేట్, పోలీస్ కార్యాలయంలో కూడా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హాల్ టిక్కెట్ల విషయంలో విద్యార్థులకు అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలకు ఫ్లైయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్, ఇంటర్ నెట్ సెంటర్లను ఉదయం 8.30 గంటల నుంచి పరీక్ష ముగిసే వరకూ ఆయా షాపులను మూసి ఉంచాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో అవసరమైన మందులు, ఒఆర్ఎస్ ప్యాకెట్లతో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్యం ఏర్పాట్లను ప్రతిరోజూ పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆయా అధికారులకు అప్పగించిన విధులను అందరూ బాధ్యతతో నిర్వహించి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్దా సెక్షన్-163 బిఎన్ఎస్ఎస్ అమలు చేయాలన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి (ఆర్ఐఒ) కె.చంద్రశేఖర్ బాబు మాట్లాడుతూ ఫిబ్రవరి 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ 29 పరీక్షా కేంద్రాల్లో ప్రాక్టికల్(ఒకేషనల్), ఫిబ్రవరి 10 నుంచి నుంచి 20వ తేదీ వరకూ 69 పరీక్షా కేంద్రాల్లో ప్రాక్టికల్(జనరల్) పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో అదనపు అడిషనల్ ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్ఐఒ కె.చంద్రశేఖర్ బాబు, డివిఇఒ బి.ప్రభాకరరావు, డిఇసి కమిటీ సభ్యులు కె.యోహాన్, ఎల్. శ్యామ్ కుమార్ పాల్గొన్నారు.

బిసి యాక్షన్ ప్లాన్ లక్ష్యాలను పూర్తి చేయాలి

జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బిసి యాక్షన్ ప్లాన్ నిర్దేశించిన లక్ష్యాలను సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో బుధవారం బిసి యాక్షన్ ప్లాన్ అమలుపై అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బిసిల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ప్రజల ఆశయాల మేర పని చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలను అర్హులైన వారికి మార్చి నెలాఖరులోగా అందించాలన్నారు. స్వయం ఉపాధి కోసం అందిన దరఖాస్తులను పరిశీలించి, ఆర్థిక మంజూరు కోసం సంబంధిత బ్యాంకులకు పంపి, బ్యాంకర్లు లోన్లు మంజూరు చేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. యూనిట్ల స్థాపనలో అభ్యర్థులు ఏదైనా సమస్యలు ఎదుర్కొంటే వాటిని తెలుసుకుని, సంబంధిత అధికారులతో



పరిశీలిస్తున్న ఘంటా పద్మశ్రీ

మాట్లాడి సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక శిక్షణతోపాటు సాంకేతిక మద్దతు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బిసిలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఈ ప్రణాళిక ఎంతగానో ఉపయోగపడుతుందని, వాటిని పూర్తిస్థాయిలో అమలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో బిసి యాక్షన్ ప్లాన్ లక్ష్యాలు, లక్ష్యసాధన వివరాలను జెడ్‌పి ఛైర్‌పర్సన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి కెఎస్ఎస్.సుబ్బారావు, బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.పుష్పలత పాల్గొన్నారు.

ఫిబ్రవరి 7న బాలోత్సవం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

వచ్చే నెల ఏడో తేదీన నూజివీడు బాలోత్సవం నిర్వహించనున్నారు. నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులకు పట్టణంలోని ఎంప్లాయీస్ కాలనీలో ఉన్న కేంద్రీయ విద్యాలయ భవనం పక్కన ఉన్న పార్కు ప్రాంతంలో బాలోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ప్రచార గీతాన్ని స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నూజివీడు బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి గాంగేడు మాట్లాడుతూ బాలోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హేలాపురి బాలోత్సవం సమన్వయ కార్యదర్శి జి.నరసింహారావు, అమరావతి

గీతం విడుదల చేస్తున్న ప్రముఖులు

బాలోత్సవం కార్యదర్శి యువి.రామరాజు, నూజివీడు బాలోత్సవం కో-ఆర్డినేటర్ ఎన్ఆర్.హనుమాన్లు, నూజివీడు బాలోత్సవం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌కె.సుభాని, కమిటీ సభ్యులు మోహన్‌రావు, శిఖ ఆకాష్, ఉదయలక్ష్మి, ఉమ, ప్రసాద్, ఎవి.సుబ్బారావు, స్ఫూర్తి పాల్గొన్నారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

ఇవిఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఈవిఎం గోదామును జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా బుధవారం కలెక్టర్ వెట్రిసెల్వి ఈవిఎం గోదామును సందర్శించి షట్టర్లకు ఉన్న సీళ్లను, ఫైర్‌ఎక్స్ టింగ్విషర్‌లను, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అదే విధంగా ఈవిఎంల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్కడ భద్రతా విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రంగుల కలగా విజన్ - 2047 ప్రణాళిక

హామీల అమలుకు చంద్రబాబు తిలోదకాలు - సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉట్టికి ఎగరలేనమ్మ.. ఆకాశానికి ఎగురుతాను అన్నట్లుగా కూటమి ప్రభుత్వం విజన్-2047 ప్రణాళిక ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం విమర్శించారు. మరోవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదనే పేరుతో ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు తిలోదకాలు ఇచ్చేందుకు చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఏలూరు ఉద్దరాజు రామం భవనంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ప్రజా సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంతెన సీతారాం మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్షీణించిందని, నీతి అయోగ్ నివేదిక ప్రకారం దేశంలో 18 రాష్ట్రాల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి 17వ స్థానంలో ఉందని, ప్రజలపై పన్నుల భారం తప్పదని, సంక్షేమ పథకాలు అమలు చేయలేం అని ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని, సంపద సృష్టిస్తామని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు ఇప్పుడు మాట మార్చి ప్రజలపై భారాలు వేస్తామంటే ఊరుకునేది లేదని ప్రజలు సహించరని చెప్పారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర కాకుండా అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నారని అన్నారు. ప్రజలకు ఉపాధి కల్పించి

మాట్లాడుతున్న మంతెన సీతారాం

కొనుగోలు శక్తి పెంచకుండా రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అమరావతికి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, నిర్వాసితుల పరిహారం, పునరావాసానికి నిధులు సాధించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విజన్-2047 పేరుతో 1/70 చట్టం సవరణ కుట్ర చేయడం ఆదివాసుల హక్కుల హరించడమేనని విమర్శించారు. టూరిజం అభివృద్ధి పేరుతో 1/70 చట్ట సవరణ చేయాలని సాక్షాత్తూ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ ప్రకటించడం ఆదివాసీల హక్కులు, చట్టాలకు తీవ్ర విఘాతం కలిగించడమే అని తెలిపారు. ఆదివాసీ ప్రాంతంలో టూరిజం అభివృద్ధి చెందాలంటే హోటళ్లు, రెస్టారెంట్లు, పార్కుల నిర్మాణం కోసం 1/70 చట్టం సవరణకు రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగంలోతైన అధ్యయనం చేయాలని, అప్పుడే పెట్టుబడులు పెరిగి టూరిజం అభివృద్ధి చెందుతుందని శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు ప్రకటించడం ఆదివాసీ హక్కులు చట్టాలకు తీవ్రమైన విఘాతం కలిగించి ఆదివాసీలకు తీవ్ర ద్రోహం చేయడమేనన్నారు. తక్షణం అసెంబ్లీ స్పీకర్ ప్రకటన వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. భైరవపట్నం అగ్నిప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఎక్స్ గ్రేషియో చెల్లించాలని, గాయపడిన వారికి పూర్తిస్థాయి వైద్యం ప్రభుత్వం అందించాలని ఆయన కోరారు. ఆక్వా చెరువులను పిట్టల నుండి కాపాడేందుకు కాపలాదారులు ఉండే వీరికి సొంత స్థలాలు కూడా లేవని, కాబట్టి ఆ కుటుంబాలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఇళ్లు కాలిపోయిన కుటుంబాలకు నిత్యావసర సరుకులు, తక్షణ సాయం రూ.10 వేలు ప్రభుత్వం అందించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, జి.రాజు, ఎం.నాగమణి, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణతో, నాయకులు పాల్గొన్నారు.

కొల్లేరు ప్రజల సమస్యలు సిఎం దృష్టికి తీసుకెళ్తా

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు

కొల్లేరు ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా జీవనం సాగిస్తున్న ప్రజల సమస్యలు సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ హామీ ఇచ్చారు. ఏలూరు శాంతినగర్‌లోని ఎంపీ మహేష్ కుమార్ క్యాంపు కార్యాలయం ప్రతినిధులను ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, కొల్లేరు పరిరక్షణ సమితి నాయకులు యేసురాజు, సత్యనారాయణ, బికెఎం నాని, కొల్లి బాబి, తదితరులు బుధవారం కలిసి కొల్లేరు ప్రాంత ప్రజల సమస్యలతో కూడిన సమగ్ర నివేదికను అందించారు. అనంతరం అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల నేపథ్యంలో కొల్లేరు ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులను ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, కొల్లేరు పరిరక్షణ సమితి నాయకులు ఎంపీ మహేష్‌కుమార్‌కు ఫోన్‌లో వివరించారు. గతంలో చంద్రబాబు కొల్లేరు ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపారని, గత వైసిపి ప్రభుత్వంలో అప్పటి సిఎం జగన్ పట్టనట్లు వ్యవహరించడం వల్ల కొల్లేరు సమస్య మొదటికొచ్చిందని పరిరక్షణ సమితి నాయకులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు.

ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల కైకలూరులో జరిగిన సమావేశంలో తీర్మానించిన వివరాలు కొల్లేరు ప్రాంత ప్రజల అభిప్రాయాలను త్వరలో సిఎం చంద్రబాబును కలిసి వివరిస్తానని ఎంపీ మహేష్ కుమార్ కొల్లేరు పరిరక్షణ సమితి నాయకులకు భరోసా ఇచ్చారు. అసెంబ్లీలో తీర్మానించి కేంద్ర ప్రభుత్వానికి పంపించడానికి ఎంఎల్‌ఎలతో కలిసి తన వంతు కృషి చేస్తున్నట్లు ఎంపీ తెలిపారు. కొల్లేరు ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారాన్ని గత వైసిపి ప్రభుత్వం విస్మరించడంతో ప్రస్తుతం ఆ ప్రాంతవాసులు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొందని ఎంపీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సహకారం కోరడంతో పాటు, న్యాయ పరంగా కొల్లేరు ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కారానికి సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపీ స్పష్టం చేశారు. త్వరలోనే కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఆ ప్రాంత ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఎంపీ మహేష్ కుమార్ భరోసా ఇచ్చారు.

పట్టిసీమ ఉత్సవాలను విజయవంతం చేయండి

ఉత్సవ కమిటీ ఛైర్మన్, ఆర్‌డిఒ రమణ

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ ఛైర్మన్, ఆర్‌డిఒ ఎంవి.రమణ సూచించారు. పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాటుకు సంబంధించి మొదటి సమావేశం వివిధ శాఖల అధికారులతో బుధవారం పట్టిసీమ పుణ్యక్షేత్రం రేవు వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ గోదావరి నది మధ్యలో జరిగే ఈ ఉత్సవాలకు దూర ప్రాంతాల నుంచి యాత్రికులు వస్తారని, వారికి గోదావరిపై అవగాహన ఉండదన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే యాత్రికులకు లోటుపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ హరి సూర్యప్రకాష్ మాట్లాడుతూ యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తామని, మెట్లు ప్రాంతంలో గతం కంటే ఎక్కువగా టెంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం

మాట్లాడుతున్న అధికారులు

పోలవరం ఎస్ఐ పవన్‌కుమార్ మాట్లాడుతూ గోదావరి నది మధ్యలో జరిగే ఈ ఉత్సవాలకు యాత్రికులు ఎక్కువ వస్తారని, వారిని ఉద్దేశించి ఉన్నతాధికారులకు, ఆయన సలహాలు సూచనలు ఇచ్చారు. ప్రధానంగా గోదావరి ఇసుక తిన్నెలపై మైకులు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ నుంచి మాట్లాడితే ఆలయం వరకు వినబడేలా చేయాలన్నారు. దీని ద్వారా రాత్రిపూట యాత్రికులను కంట్రోల్ చేయవచ్చని, ఎవరైనా తప్పుకుపోయినా, ఎవరికైనా ప్రమాదం జరిగినా వెంటనే మైకుల ద్వారా కంట్రోల్ రూమ్‌కు తెలియపరచవచ్చని చెప్పారు. ఈ ఉత్సవాలకు గోదావరి నది మధ్యలో ఏర్పాటు చేసే రోడ్డు మార్గాన్ని బోట్ సూపరింటెండెంట్ అధికారుల ద్వారా పరిశీలించి రేవును పాటదారుడుకు అప్పచెప్పనున్నట్లు తెలిపారు. త్వరతగతిన పనులు మొదలుపెడితే నాటికి పనులు పూర్తి చేయవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి చాగంటి సురేష్‌నాయుడు, తహశీల్దార్ సాయిరాజు, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి చాగంటి సురేష్ నాయుడు, ఎంపిడిఒ ఇ.శ్రీనివాసరావు, పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, సిఐ బాలసురేష్‌బాబు, ఎస్ఐ పవన్‌కుమార్, పంచాయతీ సర్పంచి సబ్బారపు శ్రీరామ్మూర్తి, పంచాయతీ కార్యదర్శి తాతి విజయ కుమారి, ఎంపిటిసిలు, రెవెన్యూ డిపార్ట్‌మెంట్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, ఎక్సైజ్ శాఖ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారులు వేధిస్తున్నారని ఫిర్యాదు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని యర్రగుంటపల్లిలో వడ్డీ వ్యాపారుల నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ యర్రగుంటపల్లి సచివాలయం వద్ద బాధితులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన డి.ప్రమీలకుమారి, మణికంఠ, చంద్రశేఖర్, ఉమామహేశ్వరావు యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన మహిళ వద్ద రెండు రూపాయల వడ్డీ చొప్పున ప్రామిసరీ నోటు ద్వారా అప్పు తీసుకున్నారని, మొత్తం అప్పు కట్టిన తరువాత వడ్డీ ఇంకా కట్టాలని, అప్పుడే ప్రామిసరీ నోటు ఇస్తామని చెబుతున్నారని, తమకు న్యాయం చేయాలని వారు ఫిర్యాదు చేశారని ఎస్ఐ తెలిపారు. దీనిపై దర్యాప్తు చేస్తునామని తెలిపారు.

రహదారి నిబంధనలు పాటించాలి

జంగారెడ్డిగూడెం బ్రేక్ ఇన్‌స్పెక్టర్ రంగనాయకులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రతిఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని జంగారెడ్డిగూడెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎస్.రంగనాయకులు అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా టి.నరసాపురంలో ఆటో, ట్రక్ యూనియన్, రవాణా శాఖ సంయుక్తంగా బుధవారం రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రంగనాయకులు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఇరువైపులా పాసెంజర్లను కూర్చోబెట్టుకుని ప్రయాణం చేయరాదని సూచించారు. మద్యం తాగి వాహనం నడపడం ప్రమాదకరమన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఆటో నడపొద్దని, రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానం చేరాలని సూచించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి వాహనాలను నడపడం శ్రేయస్కరమన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ సురేష్ బాబు, ఎఎస్ఐ జయకుమార్ పాల్గొన్నారు.

భీమడోలులో మహిళా రక్షక దళం పర్యటన

ప్రజాశక్తి - భీమడోలు

మహిళల రక్షణ కోసం జిల్లా అభయ మహిళా రక్షక దళం పనిచేస్తుందని పోలీసు అధికారులు తెలిపారు. మహిళలకు సామాజిక, న్యాయ, భద్రత, హక్కుల కల్పనపై అవగాహన కల్పించేందుకు అభయ వాహనం భీమడోలు మండలంలో బుధవారం పర్యటించింది. ఎస్పి పర్యవేక్షణలో మహిళా పోలీస్ సిఐ, ఎస్ఐలు ఎం.సుబ్బారావు, కాంతిప్రియ ఆధ్వర్యంలో అభయ వాహనంతో పోలీసు అధికారుల పర్యటనలో భాగంగా గుండుగొలను, ఆగడాలలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడ అభయ వాహనం ద్వారా హెల్ప్‌లైన్ సర్వీసులు, అత్యవసర సహాయ లైన్ల గురించి వివరించారు. వీరికి గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు సహకరించారు. మహిళలు, బాలికలు, వృద్ధుల భద్రత కోసం అభయ మహిళా రక్షక దళాలు పనిచేస్తున్నాయని వివరించారు. సురక్షిత సమాజ స్థాపన కోసం అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రైతులకు ఇబ్బందిలేకుండా సర్వే చేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

రీ సర్వే తప్పులు తడకగా చేస్తే సచివాలయ సర్వేయర్ బాధ్యత వహించాల్సి ఉంటుందని తహశీల్దార్ కె.రాజకుమార్ అన్నారు. మండలంలోని అక్కిరెడ్డిగూడెంలో జరుగుతున్న రీ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అనుకూలంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్వే చేయాలన్నారు.

18 ఏళ్లు నిండినవారికి ఆర్అర్ ప్యాకేజీ ఇవ్వాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

18 ఏళ్లు నిండిన పోలవరం నిర్వాసితులందరికీ ఆర్అర్ ప్యాకేజీ ఇవ్వాలని కాంగ్రెస్ పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బండి విజయభాస్కర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కుక్కునూరు మండలాధ్యక్షులు గజ్జిరాజు అధ్యక్షతన తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ గత ఏడేళ్ల క్రితం సర్వే చేసి ప్యాకేజీ ప్రకటించారన్నారు. దానికి ఇప్పుడు అదే ప్యాకేజీ ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. అప్పటికి 18 ఏళ్లు నిండని యువత చాలామంది ఉన్నారని, వారికి అన్యాయం జరుగుతుందని చెప్పారు. ఇప్పటికీ 18 ఏళ్లు నిండినవారందరికీ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సి సెల్ జిల్లా చైర్మన్ రాజారత్నం, కుక్కునూరు మండల ఉపాధ్యక్షులు వడ్డే రఘుబాబు, ఎస్టి అధ్యక్షులు మడకం వీరయ్య, ఎస్సి అధ్యక్షులు గాడిద మధుబాబు, సెక్రటరీ వీరాచారి, వర్శా నాగేశ్వరరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్‌కె.షఫీ, బిసి సెల్ సమ్మయ్య గౌడ్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఒకే కుటుంబంలో ముగ్గురు అదృశం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు కనిపించడంలేదని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల ప్రకారం... ఏలూరు నగరంలోని తంగళ్లమూడి ప్రాంతంలో లక్ష్మి మెడికల్ పేరుతో పి.వీరవెంకటసత్యవరప్రసాద్ అనే వ్యక్తి మెడికల్ షాపును నిర్వహిస్తున్నాడు. ఇతనికి ఏలూరు నగరంలోని రాణినగర్ ప్రాంతానికి చెందిన వెంకట పార్వతి అనే యువతతో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి రెండేళ్ల వయసున్న ఒక కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో ఈ నెల 25వ తేదీన వివాహ వేడుకకు వెళ్లి వస్తామని వెంకట పార్వతి ఆమె తండ్రికి తెలిపి కుటుంబంతో సహా బయటికి వెళ్లారు. ఇప్పటివరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో పార్వతి తండ్రి రంగారావు తన కుమార్తె, అల్లుడు, మనవడు కనిపించడంలేదని రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రెండో పట్టణ ఎస్ఐ నాగ కళ్యాణి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతను ఇచ్చిన ఫిర్యాదులోనే తమ అల్లుడు ఆర్థిక కారణాలవల్ల ఇంట్లోంచి బయటికి వెళ్లిపోయి ఉంటాడని ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడు కనిపించడంలేదని తల్లి ఫిర్యాదు

భీమడోలు :కుమారుడు కనిపించడంలేదని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సూరప్పగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని పాతూరు ఆవాస ప్రాంతానికి చెందిన కొప్పిశెట్టి వెంకన్న కనిపించడంలేదని అతని తల్లి గంగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంకన్నకు మతిస్థిమితం లేనట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈ నెల 14వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన వెంకన్న ఆచూకీ ఇప్పటివరకు తెలియరాలేదని తెలిపింది. గతంలో సైతం పలుమార్లు వెంకన్న ఇంట్లోంచి వెళ్లి రెండు, మూడు రోజుల తర్వాత ఇంటికి తిరిగి వచ్చేవాడని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఈసారి ఆ విధంగా రాకపోవడంతో గత 15 రోజులుగా అతని ఆచూకీ కోసం తల్లి, ఇతర కుటుంబ సభ్యులు బంధువుల వద్ద ఇతర చోట్ల గాలించారు. ఆచూకీ తెలియకపోవడంతో భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తప్పిపోయిన వ్యక్తి వివరాలు తెలిసినవారు భీమడోలు ఎస్ఐ 9440796652కు, భీమడోలు పోలీస్‌స్టేషన్ 9154880255 సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో జైలు, జరిమానా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

చెల్లని చెక్కు కేసులో నూజివీడుకు చెందిన కొలవెన్ను వరలక్ష్మికి ఆరు నెలలు జైలు శిక్ష, రూ.ఏడు లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. 2021 జూన్ మూడో తేదీన నూజివీడుకు చెందిన చలమల వెంకటరమేష్, వరలక్ష్మికి తన కుటుంబ ఖర్చుల నిమిత్తం రూ.6.50 లక్షలు అప్పుగా ఇచ్చారు. కొంతకాలం తర్వాత బాకీ తీర్చమని వెంకట రమేష్ అడుగగా వరలక్ష్మి 2022 మే ఒకటో తేదీన రూ.6.50 లక్షలకు చెక్కు ఇచ్చారు. ఆ చెక్కును బ్యాంకులో వేయగా వరలక్ష్మి ఖాతాలో నగదు లేదని బ్యాంకు వారు తిప్పి పంపారు. తర్వాత వెంకట రమేష్ కోర్టులో కేసు వేయగా విచారణ అనంతరం న్యాయమూర్తి జైలు శిక్ష జరిమానా విధించారు.

నాటుసారా స్థావరాలపై దాడి

ప్రజాశక్తి - చింతలపూడి

సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించినట్లు చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిగూడెం, పతంగులగూడెం గ్రామాల్లో దాడులు చేసినట్లు చెప్పారు. నాగిరెడ్డిగూడెంలో ఇద్దరి వద్ద నుంచి 700 లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పంతంగులగూడెంలో 700 లీటర్ల బెల్లపు ఊట, పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పాత నాటుసారా కేసుల్లో నిందితులు అయిన నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఇద్దరిని చింతలపూడి తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అగ్నిప్రమాద ఘటనలో మరొకరు మృతి

ఐదుకు చేరిన మృతుల సంఖ్య

ప్రజాశక్తి - మండవల్లి

అగ్ని ప్రమాదం పది కుటుంబాలకు నిలువ నీడ లేకుండా చేసింది. అగ్ని ప్రమాదంలో గాయపడిన వ్యక్తులను రోజుకు ఒకరిని బలి తీసుకుంటూనే ఉంది. మంటల్లో గాయాలపాలైన వంశీ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుల సంఖ్య ఐదుకు చేరింది. అగ్ని ప్రమాదం నక్కలోళ్ల కుటుంబాల్లో అంతులేని విషాదంలోకి నెట్టేసింది. ప్రత్తిపాడు స్టేజి వద్ద నక్కలోళ్ల పూరిగుడిసెలకు ఈ నెల 25న నిప్పంటుకుని పది ఇల్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. పది కుటుంబాల వారు సర్వస్వం కోల్పోవడంతో పాటు అప్పటికే ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు వారిని గుంటూరు అక్కడి నుంచి మద్రాస్‌లోని వేలేరు తరలించి వైద్యం అందిస్తున్నారు. పరిస్థితి విషమించి బాలుడితోపాటు మరో నలుగురు మృతి చెందారు. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న డబ్బా వంశీ(24) బుధవారం తెల్లవారుజామున పరిస్థితి విషమించి మృతి చెందాడు. దీంతో నక్కలోళ్ల కుటుంబాల ఆక్రందనకు అంతులేకుండా పోయింది. గ్రామస్తులు, స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు గుంటూరు చేరుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ రామచంద్రరావు తెలిపారు.

పలుచోట్ల ఉచిత వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని జంగంగూడెం యానాది కాలనీ గ్రామంలో తిరివీధి లక్ష్మీరామారావు సేవా ట్రస్ట్, ఎస్ఎస్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించినట్లు ట్రస్ట్ వ్యవస్థాపక ఛైర్మన్ తిరివీధి కృష్ణ తెలిపారు. మండలంలోని జంగంగూడెం యానాది కాలనీ గ్రామంలో ఆయన బుధవారం మాట్లాడుతూ విజయవాడ నగరానికి చెందిన ఐ అండ్ జనరల్ కేర్ ఎస్ఎస్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు చెప్పారు. అత్యవసర విభాగ వైద్యులు ఎస్‌కె.నాయబ్ రసూల్, కంటి చికిత్స నిపుణులు జమ్ రుద్ షాహిన్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేసినట్లు వివరించారు. ఈ క్యాంపులను నూజివీడు మండల పరిధిలోని జంగంగూడెం యానాదుల కాలనీ గ్రామ పరిసర ప్రాంతంలోని ప్రజలు

నూజివీడులో...

వినియోగించుకున్నట్లు తెలిపారు. మరికొన్ని క్యాంపులు నూజివీడు నియోజకవర్గ పరిసరాల్లో నిర్వహిస్తామని, పేదలు నివసించే ప్రాంతాల్లో వైద్యసేవలను ఉచితంగా అందించేందుకు తమ ట్రస్ట్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని వివరించారు. ఇతర వివరాల కోసం 9640324266 సంప్రదించవచ్చని తెలిపారు. మెడికల్ క్యాంపు నిర్వహణకు సహకరించిన ప్రతిఒక్కరికీ తిరివీధి కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

ఉంగుటూరు : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, కీర్తిశేషులు వట్టి వసంత్‌కుమార్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన అభిమానులు బుధవారం గొల్లగూడెంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమని జనసేన పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ నాయకుడు వట్టి పవన్ అన్నారు. వసంత్ అనుచరుడు ముత్యాల బాలాజీ ఆధ్వర్యంలో ఏలూరు రితేష్ హార్ట్‌కేర్ ఆసుపత్రి సౌజన్యంతో ఇసిజి, ఎకో తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు సోదరుడు భీమరాజు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి కృష్ణంరాజు, సీనియర్ నాయకుడు కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, మానవత రాష్ట్ర కార్యదర్శి సాగిరాజు జానకిరామరాజు, యెగ్గిన ఉమా, వేములపల్లి సుధీర్ పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ సూచనలు పాటించాలి

పలుచోట్ల పశు ఆరోగ్య శిబిరాలు

ప్రజాశక్తి - భీమడోలు

రైతులకు అదనపు ఆదాయ వనరుగా మారిన పాడి పెంపకాన్ని ప్రోత్సహించేందుకు, సమర్థవంతంగా పెంపకాన్ని చేపట్టేందుకు పశుసంవర్ధక శాఖ ఇస్తున్న సలహాలు, సూచనలు పాటించాలని భీమడోలు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఇక్కుర్తి సాయిరమేష్ కోరారు. ఆయన ఆధ్వర్యంలో పూళ్ల పశు వైద్యులు మున్నంగి హరికృష్ణ లింగంపాడు ఆవాస ప్రాంతంలో, గుండుగొలను పశు వైద్యులు రమ్యశ్రీ సూరప్పగూడెం, పాతూరు గ్రామాల్లో బుధవారం పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. పాడి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. కొల్లేరు సరస్సు ఆవాస ప్రాంతమైన పెదలింగంపాడులో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో కొల్లేరు సరస్సు, వేసవిలో ఆ ప్రాంతానికి పశుగ్రాసం కోసం వచ్చే గొర్రెలు, మేకలు, పశువులను దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుతం అందిస్తున్న సేవలకు అదనంగా మరిన్ని సేవలను అందించారు. దీనిలో భాగంగా పశువులను దోమల బారి నుంచి కాపాడేందుకు దోమతెరలు వాడాలని సూచించారు. ఈ ప్రాంతంలో జోరీగల ఉధృతి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వాటి ప్రభావం పశువుల ఆరోగ్యంపై పడుతుందని, మైక్రో ఫైలేరియా వ్యాధి ఆశించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. కొల్లేరు ప్రాంతంలోని కలుషిత జలాలు, అశుభ్ర వాతావరణంలో పెరిగిన గడ్డిని పశుగ్రాసంగా తీసుకోవడం వల్ల పశువులతో పాటు మేకలకు, గొర్రెలకు పారుడు వ్యాధి ఆశించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, వీటి నివారణకు నట్టల నివారణ మందును వాడాలని సూచించారు. పశు సంవర్ధక శాఖ వీటిని ఉచితంగా అందిస్తుందని, ఇతర వివరాలకు అందుబాటులో ఉన్న పశువైద్యశాలను సంప్రదించాలని కోరారు. శిబిరంలో పశువులకు గర్భకోశ నివారణ మందులను వేసారు. ఆ తర్వాత పశుసంవర్ధక శాఖ తరపున పాడి రైతులకు మందుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపిటిసి సభ్యులు ముళ్లగిరి జాన్సన్ ప్రారంభించారు.

జంగారెడ్డిగూడెం :పాడి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పిఎన్‌వి.శేఖర్‌దొర తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలంలోని అయ్యవారిపోలవరం గ్రామంలో మంగళవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన శేఖర్‌దొర మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతులకు

భీమడోలులో...

అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవటంతో పాటు పశువులకు సోకే పలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. 1100 పశువులకు గర్భకోశ వ్యాధులతో పాటు పలు రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. పాడి రైతులకు ఉచితంగా మందులు, పౌష్టికాహార ప్యాకెట్లు, మినరల్ మిక్సర్ ప్యాకెట్లు అందించారు. అనంతరం దూడల ప్రదర్శన నిర్వహించి గెలుపొందిన దూడల యజమానులకు పాల క్యాన్, మందులు, కాల్షియం అందించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం.భీమేశ్వరరావు, లైవ్ స్టేటస్ వీర్రాజు, నరేంద్ర గన్నమని వెంకట శ్రీనివాస్, కొడాలి శ్రీనివాసరావు, నాదెండ్ల కృష్ణ, వరలక్ష్మి, దొమ్మేటి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

తామర పురుగుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చెక్కపల్లి, అక్కిరెడ్డిగూడెం, వేల్పుచర్ల, చిలబోయినపల్లి గ్రామాల్లో జిల్లా ఉద్యాన అధికారి డాక్టర్ ఎస్.రామ్మోహన్ సామాజిక తనిఖీ పథకాల్లో భాగంగా శాశ్వత పందిరి కూరగాయల సాగు, బొప్పాయి, ఆయిల్‌పామ్ కలెక్షన్ సెంటర్‌ను పర్యవేక్షించారు. ఈ పర్యవేక్షణలో ఎస్.రామ్మోహన్ రైతులకు పలు సూచనలు చేశారు. శాశ్వత పందిరి తనిఖీల్లో భాగంగా కూరగాయాల్లో వ్యాప్తి చెందే తామర పురుగుల పట్ల రైతులకు అవగాహన కల్పించారు. ఎకరానికి పది నుంచి 15 చొప్పున బ్లూ, పసుపు, జిగురు అట్టలను అమర్చాలన్నారు. ఉధృతి ఎక్కువైతే స్పైనో సైడ్ 0.3 లేదా డెలిగేట్ ఒక లీటర్ చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. రైతులందరూ శాశ్వత పందిరి కూరగాయలు వేయడం వల్ల అధిక దిగుబడి పొందవచ్చన్నారు. నాణ్యమైన పంట తీయవచ్చని, శాశ్వత పందిరి పథకం కూరగాయలు వేసుకుని రైతులందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారిణి కె.జ్యోతిప్రియాంక, ఎఇ కె.సూరిబాబు, రైతులు పాల్గొన్నారు.

చర్చి అభివృద్ధి పనులకు ఇటుకలు అందజేత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

స్థానిక ఆర్‌సిఎం ప్రార్థనా మందిరం అభివృద్ధి పనుల నిమిత్తం రూ.40 వేల విలువైన ఇటుకలను మంత్రి కొలుసు పార్థసారధి తన వ్యక్తిగత సిబ్బందితో బుధవారం అందించారు. నెల రోజుల క్రితం మంత్రి నూజివీడు మండలం అన్నవరం గ్రామంలో పర్యటించారు. ఆ సమయంలో ప్రార్థనా మందిరం ఫాదర్స్, సంఘ పెద్దలు మందిరం అభివృద్ధి పనుల నిమిత్తం మంత్రిని అభ్యర్థించారు. స్పందించిన ఆయన వ్యక్తిగత సిబ్బంది ద్వారా మంత్రి ఇటుకలను అందించారు. మంత్రి పార్థసారధికి అన్నవరం ఆర్‌సిఎం ప్రార్థనా మందిరం ఫాదర్, సంఘ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌కు జనసేన నేతల వినతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నియోజకవర్గంలోని పలు సచివాలయాల్లో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చిత్రపటం లేకపోవడానికి నిరసిస్తూ జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్‌కుమార్ గుప్త ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయాలు తనిఖీల్లో కొన్ని విషయాలను గమనించి వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరుతూ కమిషనర్ భానుప్రతాప్‌కు వినతపత్రం అందించినట్లు చెప్పారు. ప్రజలకు ఏమైనా అవసరమైన సర్టిఫికెట్ల కోసం వెళ్తే కంప్యూటర్ పనిచేయడం లేదని సచివాలయ సిబ్బంది తెలుపుతున్నారన్నారు. మున్సిపల్ కమిషనర్ దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రజల సౌకర్యార్థం ప్రతి సచివాలయంలో కంప్యూటర్లను బాగు చేయించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

ప్రజాశక్తి - ముసునూరు

మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం పెట్టాలని ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు అన్నారు. మండలంలోని స్థానిక ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న ఎఫ్ ఎ త్రీ పరీక్షలు పరిశీలించి విద్యార్థులు మంచి మార్కులు సాధించి, తమ ప్రతిభను కనబరచాలని ఆకాంక్షించారు.

భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వాడాలి

ప్రజాశక్తి -ముదినేపల్లి

ముసునూరులో..

భూసార పరీక్షలకు అనుగుణంగా రైతులు ఎరువులు వాడాలని మండవల్లి ఎడిఎ జి.వెంకటమణి అన్నారు. మండలంలోని దేవపూడి, చిగురుకోట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటమణి మాట్లాడుతూ ప్రస్తుతం మినుములో తలమాడు తెగులు గమనించామని, ముఖ్యంగా బెట్ట వాతావరణంలో తామర పురుగు ఉధృతి వల్ల ఈ తెగులు ఎక్కువగా ఉందని చెప్పారు. తలమాడు తెగులు వ్యాప్తిని అరికట్టడానికి ముందుగా తామర పురుగును నియంత్రించాలని తెలిపారు. విత్తనం దశలో ఇమిడా క్లోప్రిడ్ అయిదు మిల్లీ లీటర్లు ఒక కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. నీలం రంగు గ్రీసు పూసిన అట్టలు ఎకరానికి ఐదు ఉంచడం వల్ల పురుగు ఉధృతిని అంచనా వేసి సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జాతీయ ఆహార భద్రత మిషన్ కింద 50 శాతం రాయితీతో పురుగుమందులను క్లస్టర్‌లోని రైతులకు సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ ఇరుగ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు : మొక్కజొన్న పంటలో రసం పీల్చే పురుగులను నివారించాలంటే పసుపు బ్లూ రంగు అట్టలను ఎకరానికి 10 నుంచి 15 అమర్చాలని మండల వ్యవసాయాధికారి కె.సూరిబాబు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతు సేవా కేంద్రాల్లో రైతులకు పలు పంటలపై అవగాహన కల్పించారు. ఇ క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారులు, రైతులు పాల్గొన్నారు.

చాట్రాయి :మండలంలోని ఆరుగొలనుపేట గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి బి.శివశంకర్ రైతులతో మాట్లాడుతూ సేంద్రీయ ఎరువులను ఎక్కువగా వాడాలన్నారు. పురుగు మందులు, గుళికలు ఎక్కువగా వాడటం వల్ల పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయన్నారు. భూమిలో సారాన్ని పెంచే సేంద్రియ ఎరువులను వాడాలని, కార్బన్ స్థాయి ఎక్కువగా ఉంటే పంట దిగుబడి ఎక్కువగా వస్తుందని చెప్పారు. అనంతరం జీవామృతం తయారీ విధానాన్ని తన సిబ్బందితో కలిసి చేయించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బలివే వచ్చే యాత్రికులకు అసౌకర్యం లేకుండా చర్యలు

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - దెందులూరు

మహాశివరాత్రి సందర్భంగా బలివే ఆలయానికి వచ్చే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకుంటామని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ వెల్లడించారు. పెదవేగి మండలంలోని విజయిరాయి-బలివే ప్రాంతాన్ని బుధవారం ఆయన కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ 2019లో అప్పటి టిడిపి ప్రభుత్వంలో బలివే బ్రిడ్జిని మంజూరు చేస్తే, గత 5 ఏళ్ల వైసిపి అసమర్థ పాలనలో కనీసం ఒక బ్రిడ్జి నిర్మాణాన్ని కూడా పూర్తి చేయలేదన్నారు. బ్రిడ్జి, ఘాట్‌ల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా పూర్తి చేయలేక వంతెన నిర్మాణంలో చేతులెత్తేశారన్నారు. తిరిగి తాము అధికారంలోకొచ్చాక యుద్ధ ప్రాతిపదికన బ్రిడ్జి నిర్మాణ పనులు జరిగేలా చర్యలు చేపట్టి బ్రిడ్జి, ఘాట్‌ల నిర్మాణం పూర్తి చేయించామన్నారు. మహా శివరాత్రి సందర్భంగా వచ్చే వేలాది మంది యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపడతామని తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

180 గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్న ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఐ మండల కన్వీనర్ చోడం దుర్గ అన్నారు. కెఆర్.పురం ఐటిడిఎ పిఒ రాములు నాయక్‌కు రామన్నగూడెం గిరిజన సమస్యలపై బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దుర్గ మాట్లాడుతూ రామన్నగూడెం రెవెన్యూ పరిధిలో 4-1 సర్వే నెంబర్‌లో రామన్నగూడేనికి చెందిన 180 గిరిజన కుటుంబాలు గృహాలను నిర్మించుకుని జీవిస్తున్నారని, ఆ భూమిని ఆ గ్రామానికి చెందిన కొంతమంది స్వార్థపరులు సీతారామ దేవస్థాన భూమిగా నమోదు చేయించారని, దీంతో అక్కడ గిరిజనులకు ఎటువంటి మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆమె తెలిపారు. ఆ భూమిలో వాటర్ ట్యాంక్, అంగన్వాడీ, హాస్పిటల్ తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయన్నారు. దేవస్థానం భూమిగా నమోదు కావడం వల్ల అక్కడ ఎటువంటి ప్రభుత్వ సౌకర్యాలు అందటం లేదని, అధికారులు గమనించి గత 40 ఏళ్లు గా అదే భూమిలో నివసిస్తున్న గిరిజనుల అభివృద్ధి కోసం తారుమారు అయిన రికార్డులను పరిశీలించి దేవస్థానం పేరును తొలగించి రామన్నగూడెం గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యకర్తలు, రామన్నగూడెం గిరిజనులు ఉన్నారు.

సూర్య ఘర్ పథకంపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - ముసునూరు

సూర్య ఘర్ పథకంపై ప్రతిఒక్క లబ్ధిదారుడికి లబ్ధి చేకూర్చే విధంగా విద్యుత్ శాఖాధికారులు కృషి చేయాలని ఎంపిడిఒ జి.రాణి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ముసునూరు, రమణక్కపేట విద్యుత్ శాఖాధికారులతో ఆమె బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముసునూరు విద్యుత్ శాఖ ఎఇ వీరబాబు, రమణక్కపేట విద్యుత్ శాఖ ఎఇ ఎం.రాజ్‌కుమార్‌లు మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామాల్లో ఎస్‌సి, ఎస్‌టి హౌస్ వినియోగదారులకు ఇప్పటికే నూటికి 90 శాతం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించడంతో పాటు వారికి రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం పంచాయతీ నూతనగూడెం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు జల్లేపల్లి అచ్చాయమ్మ (109) బుధవారం ఆమె నివాసం వద్ద మృతి చెందారు. ఆమెకు ఐదుగురు కుమార్తెలు, ఐదుగురు కుమారులు, కోడళ్లు, మనవళ్లు, మునిమనవళ్లు, వారి సంతానంతో కలిసి 150 మంది కుటుంబ సభ్యులకు ఆమె పెద్ద దిక్కుగా మెలిగేవారని కుటుంబ సభ్యులు తెలిపారు. శతాధిక వృద్ధురాలు అచ్చాయమ్మ మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆమె మనువడు ప్రెస్ క్లబ్ సభ్యుడు జల్లేపల్లి చిరంజీవికి ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ సొబ్బన రాజశేఖర్ బాబు, సభ్యులు కందుల రాము, తాళ్లపూడి లక్ష్మణరావు, దొడ్డి సుధాకర్‌రాజు, కుంజం రాంబాబు, సిద్దే రామారావు, జయవరపు శేషు, షహీన్ షా, లంకా సూర్య అప్పాజీ, పితల అర్జున్, తదితరులు తమ సానుభూతిని తెలిపారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు అందజేత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ఎస్ఆర్ఆర్ జెడ్‌పి బాలుర హై స్కూల్‌లో రిటైర్డ్ హిందీ పండిట్ షేక్ అబ్దుల్ హక్ విద్యార్థులకు బుధవారం భోజన ప్లేట్లను వితరణగా అందించారు. పాఠశాల హెచ్ఎం డాక్టర్ భాగవతుల హేమలత మాట్లాడుతూ విధి నిర్వహణలో విద్యార్థులకు హిందీ నేర్పడమే కాకుండా ఉద్యోగ విరమణ అనంతరం విద్యార్థులకు అవసరమైన స్టీల్ ప్లేట్లు అందించడం అభినందనీయమన్నారు. అబ్దుల్ హక్ అందరికీ ఆదర్శనీయులని ప్రశంసించారు. పాఠశాలలోని విద్యార్థుల అభ్యున్నతి కాంక్షిస్తున్న అబ్దుల్ హక్ బాటలో అందరూ నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి వెంకన్న 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం జాతీయ రహదారి పక్కన నాయుడుపేటలో శ్రీదేవి భూసమేత శ్రీవెంకటేశ్వరస్వామి ద్వాదశ, వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 30, 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయం నిర్మించి 12 సంవత్సరాలు పూర్తయింది. ఈ క్రమంలో ద్వాదశ, వార్షిక బ్రహ్మోత్సవంతోపాటు స్వామివారికి కల్యాణం జరిపించనున్నారు. కళ్యాణానికి ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద విద్యుదీపాలంకరణ చేశారు.

త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో మార్పులు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు 220 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కండక్టర్ల మార్పు, మరమ్మతుల కోసం ఈ నెల 31వ తేదీన త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో మార్పులు చేస్తున్నట్టు ఎపిఇపిడిసిఎల్ ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అంబేద్కర్ తెలిపారు. దీనిలో భాగంగా 31వ తేదీన అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉదయం ఐదు గంటల వరకు మాత్రమే తాగునీటి, వ్యవసాయ అవసరాల కోసం త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో భీమడోలు సబ్‌స్టేషన్ పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, పెదవేగి, దెందులూరు, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల పరిధిలోని త్రీఫేస్ విద్యుత్ వినియోగదారులు, ముఖ్యంగా తాగునీటి, వ్యవసాయ అవసరాల త్రీఫేస్ విద్యుత్ వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కోరారు.

దస్తావేజు పోయినది

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, చిగురుకోట గ్రామ కాపురస్థుడు ముచ్చు వెంకన్న గారి కుమారుడు ముచ్చు నాగేశ్వరరావుకు చెందిన ముదినేపల్లి మండలం, చిగురుకోట గ్రామంలోని ఆర్.ఎస్. నెం. 182 గల వ.గ. 169.04లు గల నివేశన స్థలమును కైకలూరు రీ సర్వే నెం.లో ద.నెం. 1435/2019రుగా రిజిష్టర్డు దస్తావేజును నేను చిగురుకోట నుండి ముదినేపల్లి గ్రామంలో గల మెయిన్ సెంటర్ నందు వెహికల్‌పై వస్తుండగా జిరాక్స్ నిమిత్తం వెళ్లగా నా యొక్క దస్తావేజు నెం. 1435/2019రు ఒరిజినల్ మార్గమధ్యలో జారిపడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల తెలియజేయగలరు.

ఇట్లు
టి.శ్రీనివాసులు,
అడ్వకేట్, నోటరీ,
కోర్టుబిల్డింగ్స్ ఎదురు, గుడివాడ.
సెల్ : 9394211742.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE AT NUZIVID
EP No. 60/2016 in. ABR/CF/No. 172/2014

Margadarsi Chit Fund (P) Ltd., Santhosh Nagar Branch, Hyderabad ....D.H.R.

AND

Mr. T.V.R Vara Prasad, S/o Krishna Rao, aged / 56 years, R/o H. No. 1-8-22/1, Flat No: G-2, Sarathi Apartments, North Kamala Nagar, ECIL(P), R.R. Dist. (Property situated at Nuzivid, Eluru dist) ..... 1st J.D.R

పై నెంబరు అమలులో 1వ జెడిఆర్ తాలూకు ఈ క్రింది తెలిపిన ఇ.పి. షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ది. 17-02-2025వ తేదీన కోర్టువారి ఎదుట ఉదయం 10-30 గం.లకు బహిరంగ వేలము జరుగునని తెలియపరచటమైనది. కావున వేలంపాటలో పాల్గొను వారు వేలంపాటలో పాల్గొనవచ్చును.

1st JDR Schedule : Krishna District, Nuzivid Sub Register Office వారి యిలాకా Nuzivid Municipality ఏరియాలోని, Nuzivid Mandal, Nuzívíd Villages Agriculture Land Admeasuring Ac 0-23, 3/4 Cts Or 0.97 Hectors in Survey No. 1005/1, Nuzivid ఏరియాలో 'గల ఖాళీగా వున్న స్థలమునకు హద్దులు ::
North : Badugu Rambabu & E. Rajashekar Land.
South : Donka, West : donkas
East: Guttikonda Hari Krishna Prasad Land.
Note : Krishna district, Now present Eluru District). .
D.H.R. Value : Rs. 4,00,000/-
Ameen Value Rs. 7,00,000/-
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం).
వేలం వాయిదా : 17-02-2025.
ఫరదర్ హియరింగ్ : 24-02-2025

ఇట్లు
ఎం. రమేష్,
అడ్వకేట్, నూజివీడు.